# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర। ధర్మాత్ పరం నాస్తి। ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. | కాకినాడ:—శనివారము, సెప్టెంబరు, ౩, ౧౯౨౧. | చందా సం॥ రు ౩.

సంచిక ౩౬. | విడిసంచిక అ ౧.

## ఓమ్.

అమ్మా! నీదగ్గర మేమెల్లప్పుడును పసివారమే. మాకేది కావలసి యున్నను నీకే చెప్పుదుము. సకల అవస్థలయందును మేము నీమీదనే ఆధారపడి యుందుము. ఏ కష్టము సంభవించినను నీ చెంతనే చేరి కన్నీరు కార్తుము. ధూళిలో పొరలాడి అపరిశుభ్రులమై మేము నీ వద్దకు పరుగెత్తుకొని వత్తుము. నీవు దుమ్మును దులిపి సకల మాలిన్యమును పోగొట్టి యొడిలో గూర్చుండ బెట్టుకొని పవిత్రత యనెడు నిర్మల వస్త్రముచే మమ్ము అలంకరింతువు. చిన్నతనమున మేము అజ్ఞానులమును దుర్బలులమునై యుండి తల్లి పెట్టిన అన్నమును తిని ఆమె యిచ్చిన నీటిని త్రాగి యుంటిమి. నేడు ఆమె ముందర పెద్దవారముగా జ్ఞానవంతులముగా బలవంతులముగా కనుపింపవచ్చును. కాని జగజ్జనని యగు నీ యెదుట మేము అజ్ఞానులమే, దుర్బలులమే. మేము ఇప్పుడు సయితము ఆకలి గొన్నపుడు అన్నమును, దాహమైనపుడు జలమును, చూచుటకు వెలుతురును, నడచుటకు బలమును నీ మూలముననే పొందుచున్నాము. అట్లయ్యు పసిబిడ్డల వలె మేమేల సరళస్వభావులము కాజాలకున్నాము? చిన్ననాటి వలె నేడు మాకు సంసారమేల సుఖావహమై చిత్తరంజకముగా నుండదు? సంసారమేల నిస్తేజమై, నీరసమై కఠోరమై, పురాతనమై కనుపించుచున్నది? తల్లీ! మాతృత్వముయొక్క నూతన స్వరూపమును మాకు ప్రదర్శింపుము. తిరిగి యీ ప్రపంచమును తేజోవంతముగను, రసవంతముగను, ప్రేమానంద పూర్ణముగను, నవీనముగను జేయుము. లోహ సదృశమైన మా హృదయమును నీ సంస్పర్శచే సువర్ణముగా మార్చుము. జగత్తునందు నీవు ప్రదర్శించుచున్న ఇంద్రజాలిక శక్తికి మరియొక దృష్టాంతమును కనబరుపుము.

(సతీశచంద్రరాయ్) పా. స.

---

## ఆలోచన లేమి.

చరణకమలంబులను నొక క్షణము వీక్షించి
సరగున నీ ధ్యానమున చరియింప లేనైతి
మలినంబుపై వ్రాలు మక్షికము వలె నేను
కలుషితంబగు పనుల కామించుచుంటినే!
అగ్నిజ్వాలల దుముకు నంధకీటకమునై
పాపజ్వాలల నంటి పాడగుచు నుంటినే!
ఎండమావుల నీరు నాశించు కైవడి
ఇహలోక సుఖములను ఎపుడు నే వాంఛింతు!
చంద్రాతపము గోరు చాతకంబుల రీతి
స్నిగ్ధజలమును గోరు తృషిత హరిణము భాతి
స్తన్యపానము గోరు నాకొన్న శిశురీతి
ప్రణయ హర్షము గోరు ప్రియదంపతుల మాడ్కి
విజయగానము సల్పు విజితేంద్రియుని పోల్కి
ప్రేమ గానము సల్పు ప్రియభక్తు రీతిని
శాంతినీరము గోరి చయ్యన నినుగూడి
భక్తిశ్రద్ధల వేడి భయములను బాపికొని
ఆనంద వారిధిని నాలోచనము లేక
నమృతత్వమును గోరి యాచింప కుంటినే!

ఇ. సు. కృ.

---

# దేవుడు—దేవతలు.

:-o-:

"ఏకమేవా ద్వితీయమ్" అను సిద్ధాంతమును హిందూమతము ఉద్ఘోషించుచున్నది. ఈ సిద్ధాంతమును కాదను హిందువులెవ్వరును లేరు. అట్లే క్రైస్తవ మతము గూడ దేవుడొక్కడే యని స్పష్టముగా చెప్పుచున్నది. ఇక మహమ్మదీయ మతమును గూర్చి వక్కాణింప బనియే లేదు. నిర్మలమైన యేకేశ్వర విశ్వాసమును జనులలో వ్యాపింపజేయుట యందు ఈ ఇస్లాము మతము అగ్రస్థానమును వహించుచున్నది. ఇట్లు వివిధ మతస్థులిచ్చు సాక్ష్యమునకు దోడు విజ్ఞాన శాస్త్రము గూడ ప్రకృతియందు గల్గెడు నానా విధములైన మార్పులెల్ల ఒక్క శక్తియొక్క రూపములే యని ప్రకటించుచున్నది. ఏ మనుష్యుని కదలించినను "మీకొక దేవుడు మాకొక దేవుడా; అందఱికి ఏలేవాడు ఒకడే" యని పల్కుచుండును. కాని యీ యేకేశ్వర విశ్వాసము గాఢమయినది గాదని లోకవృత్తము నించుక పరిశీలించిన మనకు విస్పష్టము కాకమానదు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు అను పదములు వేర్వేఱు దేవతల పేర్లుగావనియు ప్రపంచమున గల్గు సృష్టిస్థితిలయ కార్యములను బట్టి ఒక్క భగవంతునికే పెట్టబడిన నామములనియు బుద్ధిమంతులు కొందఱు చెప్పగా వినవయ్యెడు, కాని నేటికిని శైవులు వైష్ణవ దేవాలయములకు గాని, వైష్ణవులు శివాలయములకు గాని పోయి అర్చింపకుండుటయు, మీదు మిక్కిలి తమ తమ దేవతల ఆధిక్యతను గూర్చి వివాద పడుచుండుటయు జూడ "దేవుడొక్కడే" అను విశ్వాసము ఈ సాంప్రదాయకులలో నెంత పైపైనున్నదో బోధపడగలదు. అయినను శివకేశవులను సమాన భావముతో జూచు జనులు కలరను సంగతిని గూడ గుర్తింపవలసియున్నది. కార్యాతురులైనవారు ఎవ్వరికైనను మ్రొక్కుదురు. ఈ మ్రొక్కులందు సమభావము కంటె కార్యసాఫల్యమే ప్రధానముగా నుండును. "కుదిరింది మందన్నట్లు" కోర్కె తీర్చినవాడు వేల్పు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు వేర్వేఱు మూర్తులును, వేర్వేఱు పురాణ గాథలును, వేర్వేఱు దేవాలయములును నుండ జనులకు మువ్వురును ఒక్కరే యను అభిప్రాయమేర్పడుట దుర్లభముగా తోచెడు. ఈ త్రిమూర్తులే గాక వీరి భార్యాపుత్రాదులును ప్రజల హృదయములపై తత్సమయములందు అధికారమును చెల్లించుచునేయున్నారు. రామభద్రుడు, వేంకటేశ్వర్లు, గోపాలుడు, సత్యనారాయణ మొదలైన పేర్ల విష్ణువుయొక్క ఆలయములును, మార్కండేయులు, నాగేశ్వరుడు, మల్లికార్జునుడు, మున్నగు నామముల శివునియొక్క ఆలయములును సాధారణముగా సర్వ పురములందును వెలసియున్నవి. విష్ణుమూర్తి తమ గ్రామమున నున్నను మఱియొక ప్రదేశమున నున్నను ఒక్కడే యను భావమే జనులలో స్పష్టముగా నున్నచో చేరువలో తమ గ్రామమున వెలసియున్న విష్ణుమూర్తికి మ్రొక్కక యెక్కడనో దూరమున తిరుపతియందున్న యే వేంకటేశ్వర్లకో యేల మ్రొక్కవలయునో తెలియరాదు. కేవలము పామరులే గాక మహాపండితులు సయితము ఇదే విధమున చేయుచుందురు. శివకేశవు లొక్కటె యనియు, సర్వజనులను పాలించువాడొక్కడే యనియు, అతడెల్లెడల నిండియున్నాడనియు, చాటెడు విద్యాధురీణులు సయితము ఈ చందముననే చేయుచుందురు. ఈ సందర్భమున శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన యొక కథ జ్ఞప్తికి వచ్చుచున్నది. ఒకడు "చిలుక" కు "రామ" యను పదమును నేర్పెనట. అంత అది యెల్లప్పుడును "రామ, రామ" యని స్మరించుచుండెను. ఒకనాడు పిల్లి వచ్చి దాని కుత్తుక పట్టుకొనెను. వెంటనే ఆ శుకము రామ స్మరణ మానివేసి "కేవు, కేవు" మని కేకవేయదొడంగెను. ఇట్లె దేవుడొక్కడే, శివకేశవు లొక్కటే యని యితర సమయములం దెంత ఘోషించినను, ఏ వ్యాధియో, ఏ కష్టమో సంభవించినపుడు పండితవరేణ్యులు గూడ తమ ఏకేశ్వర సిద్ధాంతమును పూర్తిగా మఱచి తమ వైదుష్యమును విస్మరించి చిన్న వేల్పులకెల్ల మ్రొక్క నారంభించెదరు.

పురాణ ప్రసిద్ధములగు దేవతామూర్తులే గాక చిల్లర దేవతలును కొలువబడుచున్నవి. కొన్ని కొన్ని వ్యాధులకు, ముఖ్యముగా అంటురోగములకు అధిదేవతలు గలరనియు వారు జనులను హింసించుచుందురనియు నమ్ముదురు. స్ఫోటకము గాని, బొబ్బల రోగము గాని, కలరా గాని ఒక ప్రదేశమున ఆరంభించినంతనే ప్రజలు ఈ జాడ్యముల అధిదేవతలుగా భావింపబడు పోలేరమ్మను, మహామారిని, అమ్మవారిని సేవింప దొడంగెదరు. బలుల చేతను, పప్పు, పానకముల చేతను, ఆ దేవతల సంతృప్తి పఱుప సాగెదరు. ఇట్టి సమయములందు కరుణా స్వరూపియగు భగవంతుడు కలడను విశ్వాసమునే విస్మరించెదరు. విద్యావంతులు సయితము ప్రజలు చేసెడు ఈ కొల్పులలో పాల్గొందురు. స్ఫోటకాదులు రోగములని నచ్చజెప్పి, తన్నివారణోపాయముల బోధించి, గ్రామమున వానిని వ్యాపింపకుండ జేయవలసిన బుద్ధిమంతులు సువిచార సమర్థులు గాని ప్రజలతో గలసి వర్తించుచున్నారు. "దేవుడొక్కడు" అను మాట విద్యావంతులలోను విద్యావిహీనులలోను కేవలము మాట మాత్రముగనే యున్నది. పయికేమి పల్కుచున్నను శాస్త్రవిదులయి విద్వాంసులని పేరు గన్నవారి హృదయములలో గూడ బహు దేవతా విశ్వాసము అంతర్వాహినివలె ప్రవహించుచున్నది. ప్రజాభిప్రాయమును సరళమార్గమునకు త్రిప్పి, ఆరోగ్య నియమములను, వ్యాధి నివారణోపాయములను పాటించునట్లు చేయవలసిన విద్యావంతులు కొందఱు ఇక్కాలమున జనుల మెప్పును బడయుటకై వారి మూఢాభిప్రాయములను బలపఱచుట గూడ తటస్థించుచున్నది.

ఉచితానుచిత విచారమును మాని బుద్ధిమంతులిట్లు ప్రవర్తించిన దేశమున కిక నున్నతి యెక్కడ? మౌఢ్యము తొలగునదెప్పుడు? సుజ్ఞానదీప్తి నల్గడల వ్యాపించుట యెన్నడు? బహుదేవతా విశ్వాసము మాట యెత్తిన విగ్రహారాధనమును గూర్చి ప్రస్తావించిన, విద్యాధురీణులేవేవో సమాధానముల జెప్పుట కారంభించెదరు. ఏవో అర్థకల్పనల చేయ దొడంగెదరు. తమ వాదోపబలార్థముగా పూర్వ శాస్త్రములను, ప్రస్తుత విజ్ఞానమును ముడిపెట్టి యేమేమియో చెప్ప మొదలిడుదురు. కాని యిట్టి వాదములతో నెంత కాలము గడపగలము? అనేక చర్చలైనవి. అనేక తర్కములైనవి. సత్యమునందు దృష్టి నుంచవలయును. అనుష్ఠాన

మునకు గడంగవలయును. ఏకేశ్వర విశ్వాసమును హృదయమున స్థిరముగా నెలకొల్పవలయును. శక్తి స్వరూపుడై, ప్రాణ స్వరూపుడై, చైతన్య స్వరూపుడై దేవు డొక్కడు సర్వ ప్రదేశములందును నిండియున్నాడను సంగతిని అసందిగ్ధముగా గుర్తింపవలయును. ఆ మహామహుని శాసనములు అనుల్లంఘనీయములని గ్రహింపవలయును. ఆ పరమేశ్వరుని ఆజ్ఞల మనము మన్నించుచు, తోడివారు మన్నించునట్లు చేసి యెల్లరమును ధన్యుల మగుటకు ప్రయత్నింపవలయును,

పా. న.

## ఆంధ్రశిల్ప కళాశాల, గుంటూరు.

———:o:-:o:———

ఈకళాశాల స్థాపించి నేటికి అయిదు వత్సరములయినది. ప్రతివత్సరము మా విద్యార్థులు Technical పరీక్షలలో కృతార్థులగుచున్నారనెడి సంగతి అనేకులకు తెలిసిన విషయమే. మా విద్యార్థులు స్వాతంత్ర్యశక్తి గలిగి అచ్చటచ్చట జీవయాత్ర గడుపుచున్నారు. ఇందుకు గాను నా స్వంతధనము ఆరువేల రూప్యములు ఖర్చు అయినవి.

మ. రా. శ్రీ గోవిందరాజులు శ్రీనివాసరావు పంతులు గారు, మ. రా. శ్రీ తూముగుంట్ల వెంకటప్పయ్య అందుసన్నుగారు, మ. రా. శ్రీ కొరిల్ల భావనారాయణగారు నేటివరకు నెలకు ఒక్కొక్క రూప్యము వంతున కళాశాలకు నొసంగి సహాయపడుచున్నారు. మ. రా. శ్రీ చీమకుర్తి బసవయ్యగారు గడచిన రెండు వత్సరములు కళాశాల నుంచుటకు స్థలము నొసంగి తోడ్పడిరి. మ. రా. శ్రీ తిప్పావఝ్ఝుల లక్ష్మీనారాయణ పంతులు గారు మ. రా. శ్రీ టి. బుచ్చయ్యగారు యిదివరకు మా రాత్రి పాఠశాలకు ఉపాధ్యాయులుగా నుండి మిక్కిలి తోడ్పడిరి. గుంటూరునందుగల మహాశయులు కొందరు కొంతవరకు తోడ్పడిరి. ప్రస్తుతము యీ కళాశాలయందు 20 మంది కడుబీద విద్యార్థులు ఉచితముగా విద్య నభ్యసించుచున్నారు.

ఇందులో బోధించు తరగతులు.

భాషాజ్ఞానము వరకు చదువు, చిత్రలేఖనము—Drawing, రూపలేఖనము—Modelling, లోహచ్యుతి లేఖనము—Engraving, ఛాయా లేఖనము—Painting, చిత్రాభాస లేఖనము—Relief.

వివిధములగు శిలా దారు లోహాదుల వస్తుసంయోగ తరగతు లిందుండును. చిత్రలేఖనమునందు నానావిధశాఖలు యిమిడియుండును. ఈ తరగతులు దేశమున కెంతయో లాభదాయకమై స్వతంత్ర జీవనోపాధిక సాధనమై దేశమునం దన్ని శాఖల విద్యార్థులకు మార్గమై యొప్పారును. భాషా చిత్రలేఖనముతో పాఠము ప్రారంభమగును.

ఇట్లు,

నూ. నరసింహా, శతశిల్పి.

## సమాచారము.

——o——

"అనంతపురం మండలములోని హిందూపురం నివాసులగు పతితోద్ధారకుల అభ్యర్థి నంజుండప్పగారిని హైదరాబాదు శ్రీ జీవరక్షాజ్ఞాన ప్రచారక మండలి తరఫున ఆంధ్రరాష్ట్రములో జీవకారుణ్య బోధకులుగా యేర్పరచియున్నాము. ఆంధ్రసోదరులెవరు గాని వారితో జీవకారుణ్యమును గూర్చి యుపన్యాసము లిప్పించవలెనని ప్రార్థించుచున్నాము" అని లాల్ జీ మేఘజీ గౌరవకార్యదర్శిగారు వ్రాయుచున్నారు.

శ్రీ రాజా బొమ్మదేవర వెంకట సత్యనారాయణ వరప్రసాదరావు బహద్దరు దక్షిణ వల్లూరు జమీందారుగారు తమ జమీను తాళ్లను ఈతచెట్లను బెల్లము చేయుటకు తప్ప ఇతర పనులకు ఇయ్యకూడదని యుత్తరు వొసంగిరని తెలియుచున్నది.

గుంటూరు నాయకుల నిద్దరిని అన్యాయముగ జైలులోనుంచినందులకు, ప్రభుత్వము వారు బ్రాహ్మణ బ్రాహ్మణేతర వైషమ్యములు పెంచుచున్నందులకు, ఏ గుమాస్తాయొ కాగితము ఆలస్యము చేసినందున ఆంధ్రు లెల్లరిని 'సూపర్ ఆంధ్ర యిన్ యెఫిషియన్సి' యని దూషించుటచేతను, తాము గవర్నమెంటు ఉద్యోగమునకు రాజీనామా నిచ్చితిమని పత్రి వెంకట హనుమంతరావు గారు తెలుపుచున్నారు.

శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవి గారు భీమవరం మొదలగు గ్రామములకు వెళ్లి యుపన్యాసము లిచ్చుచు స్త్రీలను దేశసేవకు పురిగొల్పుచున్నారు. ఇటులనే శ్రీమతి దువ్వూరి సుబ్బమ్మగారు రామచంద్రపురము తాలూకాయందు పాటుపడుచున్నారు.

మలబారులో ఘోరకార్యములు జరగుచున్నవి. దొరతనమువారి సేనకు మాపలాలకు కలహము జరగుచున్నది. చాలమంది యిరుపక్షములందు హతులగుచున్నారు. యాకుబ్ హుసేన్ గారు తా మచ్చటికి వెళ్ల నిచ్చిన శాంతిని చేకూర్చెదనని గవర్నరుగారితో చెప్పిరి గాని వారందుకు సమ్మతింపలేదు. ఈ కలతకు కారణములు నిలకడమీద గాని తెలియవు.

"ఆంధ్రవాణి" పత్రికా ప్రకాశకులగు న్యాపతి నారాయణమూర్తి గారిని 500 రూపాయల ధరావతు నిమ్మని దొరతనమువారు గోరిరి. పత్రిక యిటీవలనె తిరిగి ప్రారంభింపబడి నడపబడుచుండెను. మరల గండము వచ్చినది.

ఆంగ్లయువరాజు రినౌనుస్టీమరుపై ప్రయాణము సలిపెదరు. అక్టోబరు 26 వ తేదీని పోర్ట్స్మవుతు వదలెదరు. 29 వ తేదిని జిబ్రాల్టరు, నవంబరు 1 వ తేది మాల్టా, 5 వ తేది సెడురేవు, 7 వ తేది సూయజు, 12 వ తేది ఏడన్, 17 వ తేది బొంబాయి, 1922 మార్చి 17 వ తేదివరకు ఇండియాలో పర్యటన మొనర్చి పిమ్మట జపాను వెళ్లెదరు.

తిరిగి యుద్ధము ప్రారంభింపబడునను శంకతో సిన్‌ఫీను సేన చేర్చబడుచున్నది. ఐర్లాండునందలి బ్రిటిషు ప్రతినిధి యగు లార్డు లెప్టినెంటు కూడ తన సేనలను తయారు చేయుచున్నాడు. తిరిగి యుద్ధము జరుగునను అభిప్రాయము ప్రబలుచున్నది.

సత్యమేవ జయతే

# ధర్మసాధని

శనివారము, సెప్టెంబరు, ౩, ౧౯౨౧.

## మద్యపాన నిషేధ సాధనములు.

—:-o-:—

మద్యపాన నిషేధ విషయమున ఎవరికిని భేదాభిప్రాయము కానరాదు. ప్రభుత్వము వారు కూడ దీనిని గూర్చి ప్రతికూలురుగ లేనట్లు ప్రచారణ శాఖవారి ప్రచురముల వలన స్పష్టము. మద్యపానము నిరుత్సాహ పరచుచు స్వదేశీయులు, విదేశీయులు అందరు చాలకాలమునుండి మన దేశమున ప్రచారము గావించుచుండిరి. కాని వీరి ప్రయత్నములు విఫలములగుచు త్రాగుడు మాత్రము నానాటికి వ్యాపించెను. జరుగవలసిన యత్నములు జరుగుచుండినను, అది యెందువలన తగ్గలేదని పలువుర మనస్సులకు సందేహము తోచకమానదు. మద్యము సేవింప మొదలిడిన వాడు, దాని రుచి మరిగిన కొలది, దాని నిషా తల కెక్కిన కొలది, శరీర దౌర్బల్యమునకు, మనో దౌర్బల్యమునకు వశుడై త్రాగుడు వలన ఎన్నో నష్టము లున్నవని యితరులు బోధించినను, తాను స్వయముగా నవి యన్నియు ననుభవించినను జిహ్వా చాపల్యమును అణచుకొన జాలక సంపూర్ణముగ నాశన మగు వరకు త్రాగుడును విడువడు. మద్యముతో పాటు ఇతర వ్యసనములు ఒకటి తరువాత నొకటి వానినావహించి అన్నియు చేరి ఒక మద్యము కొంతకాలములో చేయు పనిని—వినాశమును— అతి శీఘ్రముగ ముగించును. నూటికి, కోటికి ఎక్కడో నైన నొకడు మద్యమునకు అలవాటుపడి తనంతట తాను దాని బారి నుండి తప్పించుకొని యుండిన నుండవచ్చునేమో గాని సర్వ సాధారణముగ దానిని చేపట్టిన వారు సర్వనాశ మగు వరకు దానిని మానరని చెప్పిన అతిశయోక్తి గానేరదు. ఇక వారికి ఇతరులు చేయు బోధ ఎంతవర కుపకరించునని యోచింపవలసియున్నది. నిషా లేని సమయములో వారు ఇతరుల హితము నాలించుటయు, విలపించుటయు కూడ తటస్థింపవచ్చును. దాలిగుంటలో నుండి తోక ఝాడించి యీవలకు వచ్చిన తోడనె కుక్క యేతీరున మెలగునో, అదే తీరున వారును అతి దుర్బల మనస్కు లగుటచే చేయగూడ దనుకొనినదె తిరిగి చేయుదురు. కేవల ముపదేశము లప్పుడప్పుడు చేయుచుండి నంతనె, త్రాగుబోతుల బాగుపడుదు రనుకొను వారు గొప్ప భ్రమలో పడుచున్నారు. ఏదియు చేయక యూరకుండుటకు మనసొప్పక వారు ఉపన్యాసము లిచ్చుచుందురు. కాని యట్టి ప్రసంగములతో నీ వ్యసనము తొలగ జాలదని వారు గ్రహించవలెను. ఇక కర్తవ్య మేమి?

మద్యపాన-నిషేధ విషయమై ఇతర దేశస్థులు ఎట్లు పాటుపడు చున్నారో చూతము. మద్యము విషము వలె పరిగణించి అమెరికా మున్నగు దేశములు మద్యపానము శిక్షార్హమని రాజకీయ శాసనములు జేసినవి. అమెరికా దేశములో అట్టి శాసన మొకటి యేర్పడు వరకు కృషి సలిపి సఫలమనోరథుడైన పస్సిఫూట్ జాన్సనుగారు త్వరలో మన దేశమునకు రానున్నారు. వారు తమ యనుభవములను కొన్ని ముఖ్య పట్టణములందు నుపన్యాసముల మూలమున వెల్లడింతురు. అవి పత్రికల ద్వారమున ప్రకటింప బడును. వారి రాక మూలమున దేశమునందలి యుత్సాహము ఇనుమడించునని నమ్ముచున్నాము. ప్రతి దేశమునందు విషము అమ్మువాడు, తిన యత్నించువాడు శిక్షింపబడు చున్నారు. అట్టి కఠిన శాసనములు విషమును గూర్చి చేయబడినవి. మద్యము విషమంత చెడ్డదిగా తలంపబడ కుండుట శోచనీయము. విషము తినవచ్చునని చేతి కందిచ్చినను, దాని నెవరో తప్ప అందరును విసరి పారవేయుదురు. దాని వలన నష్టము వెంటనె కనబడును కాన దానిని చూచిన అందరికి భయము. ఎవడో బ్రతుకు మీద విరక్తి పుట్టిన వాడు దానిని తినును. మిగిలిన వారు దానికి దూరముగ నుందురు. మద్యము విషము చేయునంత పనిని క్రమక్రమముగా చేయును. మద్యము నందున్న ఉషారునె త్రాగుబోతు చూచును గాని దానివలన కొలది దినములలో మరణ మాసన్నము కానున్నదని గ్రహింప

జాలడు. మద్యమును స్వీకరించు వారు అనేకు లుందురు. మద్యము విషముకంటె నెక్కుడు నష్టము కలుగ జేయును. విషము నిషేధించుచు చేయబడిన శాసనముల కంటె నెక్కువ కఠినముగ మద్యమును గూర్చి చేయబడు శాసనము లుండవలెను. నిషేధ శాసనము తప్ప మద్యపాన నిర్మూలనమునకు నుత్తమ సాధనము మరెద్దియు లేదు.

తమ దేశములోనె లేని నిషేధ శాసనము ఆంగ్లేయులు తమంతట తాము మన దేశమున ప్రవేశపెట్టుదురని తలంచుటకు వీలులేదు. మన దేశస్థులు మద్యపానమును తగ్గించుకొనిన తమ కభ్యంతరము లేదని చెప్పుచున్నారు. దృఢముగ ప్రయత్నించిన మన మట్టి శాసనము సహితము బడయగలము. మన ప్రయత్నమే తీరున నుండవలెనో చూచుకొని మన జాగ్రత్త మనము పడవలెను. ఈ విషయమునను విద్యాధికులు, ధనికులు దేశక్షేమము ఆలోచించి, బీదల స్థితి కనిపెట్టి కొంత త్యాగము చేయవలసి యుందురు; కొంత కష్టపడవలసి యుండును. ఆ త్యాగము, ఆ కష్టము మినహాగా ఎన్ని కబురులు చెప్పినను లాభము లేదు. ధనాశను, గౌరవకాంక్షను విడిచి మద్యపానము నిర్మూలింప ఈ క్రింది పనులు వారు పూర్తిగ నిర్వర్తింప వలెను.

౧. మద్యవ్యాపారము అతి నీచవృత్తి యని తలంచి విసర్జింప వలెను. కల్లుపాటలు తలపెట్టుటె మహాపాపమని యెరుగ వలెను. వానికి తోడ్పడ గూడదు.

౨. తాళ్ళను కల్లు గీయుటకు ఈయకూడదు.

౩. మద్యము సేవించువారి గృహముల కడ సమయమున నేగి భజన రూపముగా మద్యము యొక్క నష్టములు వారికి నచ్చచెప్ప వలెను.

౪. అంతియ గాక, మద్యము విక్రయించు స్థలములకు సమీపముగ నిలచి త్రాగవచ్చు వారిని బ్రతిమాలి మెల్లగా ఆపలకు తీసికొనిపోయి మద్యమును మరచునట్లు చేయవలెను. వారికొరకు భజనలు, నిరపాయకరములగు పానీయములు అమ్ముట యావశ్యకము.

---

## ప్రేమ సామ్రాజ్యము.

మానవలోకము ఈశ్వరు నద్వితీయునిగ తలచి యారాధించును. దీనికి మూల మతని ప్రేమభావమే. ప్రేమరాజ్యమున నివసించు ప్రతిజీవి ప్రేమనే చూపుచుండును. సమయము వచ్చినపుడు దృఢగాత్రుడు బలహీనునకు చేయూత నొసగును. వైద్యుడు పరసేవాతత్పరుడై రోగోపశమనము జేయును. ఇది విధ్యుక్తము. ఈశ్వరుడు ప్రేమమయుడగుటయు నట్టి మాతని ప్రేమ బ్రకటించుటయు స్వాభావికము. నక్షత్రములు కోట్లకొలది దూరమునుండి మినుకుమినుకు మని ప్రకాశించుచు చల్లని ప్రేమరసమును జనుల సంతాపమును దీర్ప గుమ్మరించునో యన సారెసారెకు భూలోకమునకు దిగుచుండును. దేవలోకము సహితము తేజోద్దీపితమై ప్రేమభావ పూరితమగును.

ఆహా! ఎంత విషాదపడుదును, నన్నెవరయినను నిర్దాక్షిణ్యమున గొట్ట జూచినచో. అయ్యో! పరవశుడ నగుదునే యెవ్వరయిన నాపై గరుణ జూపిన. ప్రేమ వలన లోకము నిలుచును. వైరము వలన నాశమగును. పరమపిత తన ప్రేమ భావమును జూపి మన యాధ్యాత్మిక రాజ్యమున సాక్షాత్కరింప మనము గడు సంతోషముతో నతని గలుసుకొనుటకు వ్యక్తపడుట లేదా? ప్రేమా స్వరూపునిచే నిర్మింపబడిన యీ జగత్తు కేవలము ప్రేమ మయము.

పక్షులు కలకల ధ్వనులతో ప్రేమ గీతము బాడగా నివ్వెర పడెదము. సూర్యుడు లేతకిరణముల బ్రసరింప జేసి లోకమునందలి వస్తుసముదాయమున కెల్ల యొకానొక యపూర్వకాంతి గలుగ జేయుగా నతని ప్రేమ పూరిత చిత్తమును బొగడుదుము. పిల్ల దెమ్మెరలు మెల్లమెల్లన వీచుగా ప్రేమ సందేశము వినదగుట లేదా? విశ్వవిధాత యొకటి చతురుడు? యొకటి ప్రేమమయుడు? ప్రేమ యొక్కటి లేకుండెనా యొక్కపెట్టున మన హృదయములు సృష్టి కౌశల్యమును గణనసేయక యతని పథమునుండి వీడిపోవును. ఈశ్వర ప్రేమ నిత్యమైనది. ప్రేమచేత ఈశ్వర డెవ్వడెనో ఈశ్వరునిచేత ప్రేమ యెవ్వడెనో తెలిసికొనుట దుర్గాము. ప్రేమ సుధాధారలను గ్రోలువాని భాగ్యమే భాగ్యము. అతని ప్రేమ సందేశమును బ్రకటించు మనుష్యుని జన్మమే జన్మము. మన మతని ప్రేమ రాజ్యమున నివసించి సర్వ శుభములను బడయుదము గాక! (From "Les Miserables")    వే. వెం.

---

## ప్రేమ సాధన.


(ఆంధ్రపత్రిక లోని అనువాద మందలి భాగము.)

మనము సామాన్యులము ప్రేమను గూర్చి మాటాడుకొన గల్గుదుమా? అట్లు చేయుటకు మనకు హక్కు గలదా? మన నిత్యకృత్యములలో పరుల మాట మనము తలంచెదమా? ప్రేమ యొక్క నిజరూపమును, ప్రతివాడును యెవడైనను కనుగొని, యితరుల క

ది లేదని భావించుటకు ప్రేమ అంత సులభసాధ్యమైన మనోభావమా? ఏసుక్రీస్తు నిర్యాణమునకు ముందు, తన శిష్యులు వలదన్నను వారి పాదములు ప్రక్షాళనము గావించి యిట్లు చెప్పెను. "మీరు నన్ను గురువనియు ప్రభువని పిలుచుచున్నారు. సరే బాగున్నది. నేను గురుడను ప్రభువును గూడాను. అటువంటి నేను మీపాదముల గడిగినపుడు మీలో మీరు ఒకరి పాదముల నొకరు కడుగవలయును. నేను మీకు చేసినట్లే మీరును చేయవలెనని యిది యొక ఉదాహరణముగ చెప్పుచున్నాను. నౌకరు యజమానుని కంటె గొప్పవాడు కాడు. ఆమాట నిశ్చయము, నిశ్చయము. పంపబడిన వాడు, వానిని పంపిన వానికంటె గొప్పవాడు కానేరడు" ఆయన నిర్యాణమును పొందక ముందు తన శిష్యులకే బోధచేయవలసి వచ్చెను. తన ప్రియశిష్యులకు దాని ప్రాముఖ్యమును కష్టమును తెల్పుటకు వారి పాదప్రక్షాళన చేయుట యనెడి యసాధారణ రూపమున బోధచేసెను. అట్లు చేయుటలో ఆయన యుద్దేశమేమి? నిజమైన ప్రేమతో నొక పని జేయుటగాని సేవ జేయుటగాని చాల కష్టమనియు, అట్టి యుద్దేశము కలుగుటే యరుదనియు ఆయన తలంచెను. భరతఖండములోని మహాఋషులు తపస్సంపన్నులే, తమ జీవితమంతయు ప్రేమ భావోత్సాహములతో గడుపజాలక, జీవకోటి యంతయు అన్యోన్య ప్రేమభావముతో నుండు బృందావనములో నీచజంతు రూపముగ నైన జన్మించుట కిచ్ఛగించిరి. మానవు డెవ్వడైనను సరే, సంపూర్ణ ప్రేమాస్వరూపుడు గాడనియు, ఆ స్వరూపము అతిభక్తిమార్గము నవలంబించి బ్రహ్మతో నైక్యము బొందినపుడే సంభవించుననియు గీతలో చెప్పబడి యున్నది. మతస్థాపకులు చెప్పినటుల నిదియే ప్రేమయొక్క స్వభావమును రహస్యమును. అట్టి ప్రేమను గూర్చి సమయాసమయములు లేకుండ వదరుట పాపము కాదా. ఉదయము మొదలు సాయంత్రము వరకును పొట్టకూటికై దేవులాడుకొను మనకు ప్రేమ యన నేమి తెలుసును? గాంధి మహాత్ముని వంటివారు దానిని గూర్చి ముచ్చటించ వచ్చును. ఏలనగా, ఆయన వృత్తి సంబంధమయిన పని మీద దక్షిణాఫ్రికాకు వెళ్లినను, ఆ ప్రేమ స్వభావ మనునది పొంగి పొరలివచ్చి తదనుకూలముగా పనిజేసెను. ఇంతే కాక బీహారములో ధర్మశాలలలో నొక బీదప్రయాణికుడు కాసిని మెరపకాయలు తిని గంజిని త్రాగి యుండుట జూచి ఆయన పట్టెడన్నమును తినుట గూడ విసర్జించెను. శ్రీయుత చిత్తరంజనదాసుగారు, ఉండ కొంపైన యుండునా యను నాలోచన లేక సర్వత్యాగము జేసియుండుటచే ప్రేమయన నేమో మాటాడగల్గును. మోతీలాలు నెహ్రూగారు మాతృసేవకై రాజసౌఖ్యముల విడనాడి యుండుటచే ప్రేమను గూర్చి మాటాడగలడు. లాలా లజపత్రాయిగారు కాంగ్రాలో కష్టసమయ మప్పుడు తనకున్న దంతయు విసర్జించి ఒక దుప్పటితోను లోటాతోను బయలుదేరి తనతోటి దేశస్థుల కష్టముల బాపుటకై వెళ్లి యుండుటచే, ప్రేమయన్న నేమో మాట్లాడగలడు. ఆయన అప్పటి కిప్పటికి గూడ ఆత్మ విషయమై గాని, కుటుంబ విషయమై గాని, తలచుకొనుటయే లేదని చెప్పవచ్చును. బాలగంగాధర తిలకు అసాధారణ మనోశక్తి గలవాడైనను ఆత్మసేవను మరచిపోయిన వాడగుటచే ప్రేమయన నేమో చెప్పగలడు. గోపాలకృష్ణ గోఖ్లే, భారతీయులలో ప్రధాన పురుషుడయ్యును ఫెర్గుసాను కళాశాలలో నెలకు 75 రూపాయల జీతపు ప్రొఫెసరు పనికంటె నెక్కువ దురాశ కల్గి యుండక పోవుటచే ప్రేమను గూర్చి చెప్పగలడు. అరవిందఘోషు, దేశభక్తిచే నెన్నెన్నియో కష్టముల బొందుట కంగీకరించుటచేతనే ప్రేమయన నేమో చెప్పగలడు. డాక్టరు ప్రఫుల్లచంద్రరే, శాస్త్రీయ పరిశోధనలవలన నెంతయో సంపాదించి ధనముతో దులతూగవలసిన వాడైనను, తాను సంపాదించిన దంతయు దేశమున కిచ్చివేసి యతి జీవనమును జేయుటచే ప్రేమయన నేమో చెప్పగలడు. వివేకానందస్వామి తన ఆధ్యాత్మిక మానసిక భాగ్యమునంతను సేవకై యర్పణము జేసియుండుటచే ప్రేమను గూర్చి చెప్పగలడు. తమ జీవితములో గొప్ప గొప్ప గౌరవముల బొందగల వందలకొలది వంగదేశ యువకులు వాని నన్నిటిని వదలి ప్రభుత్వపు ఆగ్రహమునకు పాత్రులై దేశసేవకు గడంగుటచే ప్రేమయిన నేమో గ్రహింపగల్గిరి. స్వాభివృద్ధికి నింతమంది ప్రేమ సేవలను ఆధారములుగ గ్రహించినపుడు, మిగిలిన వివేకు లందరును గూడ నిది యంతయు ప్రేమపై నాధారపడియున్నదని గ్రహింపరాదా?

---

# Wrist Watches.



రిష్టు వాచీ, లేక, చేతికి ధరించు గడియారము, మంచిరకము "సిలెండరు" వాచీ నిక్కెలు

| | |
|---|---|
| వెండివి 12" సైజు | రు. 6-8-0 |
| డిటో 10" సైజు చిన్నది | 9-0-0 |
| రాత్రిలు చీకటిలో కన్పించు "రేడియమ్" చేతిగడియారము | రు. 7-8-0 |
| డిటో లీవరు గడియారము 10. కెంపులు గలది | ,, 20-0-0 |
| డిటో 15 కెంపులు కల లీవరు రిష్టు వాచీ | ,, 25-0-0 |

## చలువ జోళ్లు.

——(§)——

| | |
|---|---|
| చాలుగు అద్దములు గల మబ్బురంగు జోడు | రు. 6-8-0 |
| డిటో. రెండవ రకము | ,, 5-0-0 |
| డిటో. క్లోరోఫిల్ అద్దములు | ,, 7-0-0 |
| ప్రక్కలను "వల్కనైటు" బిళ్లలును మబ్బురంగు అద్దములును గల "లారెన్సు & మేయో" కంపెనీ వారి "Amulet" | ,, 7-8-0 |

క్యాటలాగులు పంపబడును.

వలయువారు:—

యం. హెచ్. రావు అండుసన్సు,

కాకినాడ. (అని వ్రాసికోవలెను.)

# కేసరి—రత్నత్రయము.

## లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు బుతుశూల, బహిష్టు కాకుండుట, అకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగానుపోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీ మర్మవ్యాధులను కుదుర్చును. 24. డో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి, శరీరమునకు కాంతి ముఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్య సమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల.

ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజావూరు.

27. అశోకఘృతము:—ఇది స్త్రీలకు నెల నెలకు క్రమముగా బహిష్టు కాకుండా యుండినా గాని నొప్పితో కూడుకొని గాని గొజ్జలయందు నొప్పియుండుట గాని, యెచ్చుతగ్గులుగా వగుట గాని, గర్భవిచ్ఛిన్నమగుట గాని, గర్భిణి కాకుండుట మీని నన్నిటిని చక్కపరచి గర్భముధరించి సుందరమైన బలముగల బిడ్డలు పుట్టును. వెల సీసా 1 కి రూ. 1. వి. పి. 2 సీసాలవరకు 8 అ. ప్రత్యేకము.

28. బృహశ్చంద్రోదయ మకరధ్వజము:—ఇది ధాతునష్టం బలహీనమునకు, జ్ఞాపకశక్తికి, స్వప్నస్ఖలితమునకు విలువలేని గొప్ప యౌషధము, మందు ప్రారంభించినది మొదలు దిన దినము చిత్రముగ పనిచేయును. కొద్ది దినములలో నెక్కువ గుణమిచ్చును. 7 దినములకు గల మందు రూ. 3, వి. పి. 8 అ. ప్రత్యేకము.

29. చవనప్రాశనము:—ఈ ఔషధమువల్ల శ్వాసకోశసంబంధ శ్లేష్మరోగముతో చేరిన దగ్గు, ఉబ్బసము, క్షయము, గొంతుమంట, కఫము, శ్వాసకాశము, యెగరోజు, రొమ్ముజలుబు మొదలగు వ్యాధులు శీఘ్రములో గుణమగును దీనివలన బలహీనమును పోగొట్టి దేహమునకు శక్తియు, తేజస్సును కలుగచేయును. ఈ ఔషధమును చవన మహర్షికి దేవతలచే ఆయుర్వేదశాస్త్ర ప్రకారం యిప్పించగాను బుషి బాల్యదశ నొందినందున చవన ప్రాశనమను ప్రసిద్ధిచెందిన పరమౌషధము. వెల డబ్బి 1 కి రూపాయలు 2, వి. పి. 8 అణాలు ప్రత్యేకము.

బొల్లికి మందు.

పైన వ్రాయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనె వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫోరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మద్రాసు.

## ఇది చూడవద్దు
## చూచినచో మరువవద్దు

వైద్యరత్న పండిత

## డి. గోపాలాచార్యులుగారి

ఇన్‌ఫ్లుయెన్‌జా

కలరా ప్లేగు

వ్యాధులకు జగత్ప్రసిద్ధి చెందిన

## ఆయుర్వేద దివ్యౌషధములు

మా కలరా, ప్లేగుమందులకు

ముఖ్యప్రశస్త్యము

20 వత్సరములుగ ఇండియా, బర్మా, సిలో౯, ఏడె౯ మొదలగు చోట్ల అనేక వేల ప్రాణులను, కలరా, ప్లేగునుండి

## కాపాడుటయే

కలరా శెట్టు 1-కి రు 1-2-0

ప్లేగు శెట్టు 1-కి రు 2-2-0

ఇ౯ఫ్లుయె౯జా శెట్టు 1-కి రు 1-12-0

క్యాటలాగు ఉచితము. ప్యాకింగు పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

## ఆయుర్వేదాశ్రమం,

41 ఆచారప్ప౯ వీధి, జి. టి. మదరాసు.



**Reg. No. ~~M.~~ 1094.**
**The Dharma Sadhani, Cocanada.**

Printed & Published at the Dharma Sadhani Press, Cocanada, by the Editor, K. Hanumanta Rao.


**To M. R. Ry.** **V. P.** *Rs.* *As.*




1 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,